క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఆదివారం నర్సాపూర్‌తో పాటు పలు మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అర్హులకు ఆర్థిక సహాయం ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు సునీతారెడ్డి తెలిపారు. ఆమె వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

అబ్దుల్ కలామ్‌కు నివాళి



కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి చౌరస్తాలో భారత మాజీ రాష్ట్రపతి, ‘మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా’ భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తాలోని కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన దేశానికి అందించిన సేవలను గురించి గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, యువకులు పాల్గొన్నారు.

శివ్వంపేటలో వనభోజనాలు



మత్తడి పోచమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో ఆదివారం వనభోజనాల మహోత్సవం నిర్వహించారు. ప్రతియేటా శ్రావణమాసంలో వనభోజనాలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా పెద్ద చెరువు కట్ట వద్ద కొలువైన మత్తడి పోచమ్మకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడి, పంటలతో సంతోషంగా ఉండాలని మత్తడి పోచమ్మకు పూజలు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. చెట్లకింద వంట వార్పుతో గ్రామస్తులు వనభోజనాల సందడి చేశారు.

పారిశుద్ధ్య లోపంతో పాట్లు



మురుగుకాలువ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలోని రజక సంఘం కాలనీలో పారిశుద్ధ్యం లోపించింది. మురుగు కాలువ చుట్టూ ఏపుగా పిచ్చిమొక్కలు పెరగడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమల బెడద ఎక్కువవుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు డ్రైనేజీ శుభ్రం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చాముండేశ్వరికి పూజలు



అమ్మవారి దర్శనంలో పాల్గొన్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరంలో వెలసిన చాముండేశ్వరి అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేసి భక్తులకు తీర్థ, ప్రసాదాల వితరణ చేశారు.

వీధిలైట్లు వెలగడం లేదు

నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపాలిటీలోని 13వ వార్డులో పలుచోట్ల వీధిలైట్లు వెలగడం లేదని ప్రజలు ఆరోపించారు. ఆదివారం పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ పట్టణంలోని షాదీఖానా పక్క వీధిలో లైట్లు వెలగడం లేదన్నారు. అంతేగాక విద్యుత్ స్తంభాల వద్ద వైరు తెగి కింద పడినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆ వైర్‌ను తొలగించి వీధిలైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కట్టడి చేసేది ఎవరు..?

- వీధి కుక్కలు, కోతులతో జనం బెంబేలు
- పట్టించుకోని అధికారులు



శివ్వంపేట మార్కెట్ వద్ద కోతులు



కార్యాలయం ఎదుట కుక్కల మంద

శివ్వంపేట(నర్సాపూర్): వీధి కుక్కలు, కోతుల బెడదతో నిత్యం ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వాటి కట్టడికి సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడాల్సి వస్తుంది.

నిత్యం దాడులు

జిల్లాలో నిత్యం ఏదోచోట వీటి వల్ల ప్రమాదాలకు గురై చికిత్స నిమిత్తం వివిధ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి. మండల పరిధి రూప్ల తండాలో మూడేళ్ల బాలుడు నితిన్‌పై కుక్కల మంద దాడి చేయడంతో ప్రాణాలు కోల్పోయాడు. చిన్నారులు, మహిళలపై మూకుమ్మడిగా దాడికి దిగుతున్నాయి. రాత్రి వేళల్లో వీటి అరుపులతో ప్రజలు నిద్రపోని పరిస్థితి నెలకొంది. ప్రధాన రోడ్ల పై వీటి గుంపు వల్ల బైక్‌లపై వెళ్తున్న వారిపై దాడి చేస్తుండడంతో ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. తూప్రాన్- నర్సాపూర్ హైవేపై పలుచోట్ల వీటి దాడుల వల్ల ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇండ్లలోకి వచ్చి దాడులు చేస్తున్న కోతులు అడవులు అంతరించిపోవడం కోతుల సంఖ్య పెరిగిపోతుడడంతో గ్రామాల్లోకి వచ్చి చేరుతున్నాయి. కోతులు ఇండ్లలోకి వచ్చి తినుబండారాలను ఎత్తుకుపోవడంతో పాటు దాడులు చేస్తున్నాయి. వీటి సంత ఎక్కువ కావడంతో ప్రజలు ఇండ్లలోని నుండి బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

అధికారుల చర్యలు శూన్యం

కుక్కలు, కోతుల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికి సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పలు చోట్ల కోళ్ల వ్యర్థాలు రోడ్ల పక్కన ఇష్టారాజ్యంగా వేస్తుండడంతో కుక్కలు వాటికి అలవాటు మనుషుల పై దాడులు చేస్తున్నాయి.

> **సంతత తగ్గించేందుకు చర్యలు**
>
> విచ్చలవిడిగా గ్రామాల్లో సంచరిస్తున్న కుక్కల సంతత తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. పశు వైద్య సిబ్బంది సహకారంతో కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ ద్వారా నియంత్రించేందుకు కృషి చేస్తాం.
>
> – యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి

మా బతుకులు బురదమయమేనా.?

రోడ్డుపై నాట్లు వేస్తూ నిరసన



నాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న గిరిజనులు

హవేళిఘణాపూర్(మెదక్): తండాలను అభివృద్ధి చేసి గిరిజనులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ప్రగల్భాలు పలికే పాలకులు, అధికారులు తమ తండాకు వెళ్లే రోడ్డు కనీసం నడువలేని దుస్థితి ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గిరిజనులు వాపోయారు. ఈ రోడ్డు విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో విసుగువేసారిన తండావాసులు రోడ్డుపై నాట్లు వేస్తూ నిరసన తెలిపారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి బురదమయంగా ఉన్న రోడ్డును బాగు చేయాలని వారు కోరుతున్నారు.

నల్లపోచమ్మదేవికి పూజలు



నల్లపోచమ్మదేవికి పూజలు చేస్తున్న భక్తులు

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం దేవాదయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్స్‌పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేష్, విఘ్నేష్ శ్రీనల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం చేశారు. భక్తులు అమ్మవారికి బోనాలు తీశారు. ఒడి బియ్యం పోసి కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండ ఏర్పాట్లు చేశారు.

వరికొనలు తుంచి నాట్లు వేయాలి



తునికిలో నాటు వేస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

కొడిపల్లి(నర్సాపూర్): రైతులు నాటు వేసే ముందు వరికొనలు తుంచి వేయడం మంచిదని మల్లారెడ్డి యూనివర్శిటీ అగ్రికల్చర్ విద్యార్థులు అన్నారు. ఆదివారం వారు కేవీకే శాస్త్రవేత్తలు భార్గవి, రవికుమార్ ఆధ్వర్యంలో, కొడిపల్లి మండలం తునికి గ్రామానికి చెందిన రైతు మాణిక్యరెడ్డి పొలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, నాట్లు వేశారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గ్రామ రైతులకు నాటు వేసే పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,, నారు కొనలు తుంచి నాటు వేయడం వల్ల చీడపీడల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. అదే విధంగా రసాయన ఎరువుల వినియోగం సాధ్యమైనంతవరకు తగ్గించాలన్నారు. సాగు విషయంలో వ్యవసాయాధికారులు సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ విద్యార్థులు గాయని, వైష్ణవి, హరిప్రియ, జాన్వి పాల్గొన్నారు.

ఘనంగా బోనాల జాతర



చిన్నశివునూర్‌లో బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తూప్రాన్: మండలంలోని ఇస్లాంపూర్‌లో బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలతో ఊరేగింపుగా బయలు దేరారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసలతో గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు తొట్టెలతో అమ్మవారికి ఫలహారం బండ్లను డీజే సౌండ్, డప్పుచప్పులతో ఆటాపాటలతో వచ్చి సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు నత్తి మల్లేశ్, బీజేపీ నాయకులు మహేశ్, రాజు, నవీన్, వెంకటేశ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నశివునూర్‌లో..

చేగుంట(తూప్రాన్): మండలంలోని చిన్నశివునూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం మహంకాళి అమ్మవారికి బోనాల ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి సాయంత్రం మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించుకున్నారు. కార్యక్రమంలో మహిళ భక్తులతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసనలు



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలు 173వ రోజుకు చేరుకున్నారు. ఆదివారం రిలే నిరాహార దీక్ష శిబిరంలో స్థానిక మహిళలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటును విరమించే వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


శ్రీలంక క్రికెట్ టోర్నీకి నిజాంపేట యువకుడు ఎంపిక



అరుణ్

నిజాంపేట(మెదక్): శ్రీలంకలో జరగనున్న టోర్నమెంట్‌కు నిజాంపేటకు చెందిన యువ క్రికెటర్ అరుణ్ ఎంపికయ్యాడు. అరుణ్ చిన్నప్పటి నుంచి క్రికెట్‌పై మక్కువతో పదవ తరగతి పూర్తి కాగానే హైదరాబాద్ లోని హెచ్‌సీఏ శిబిరాల్లో పాల్గొనేందుకు శిక్షకుడు అరవింద్‌వద్ద మరిన్ని మెలకులవలు నేర్చుకున్నాడు. మెదక్ జరిగిన ఉచిత క్రికెట్ శిబిరాల్లో పాల్గొని బౌలింగ్ ప్రతిభ కనబరిచాడు. ఒడిశా,పంజాబ్, గోవాల్లో జరిగిన వివిధ టోర్నీల్లో కాంస్య పతకాలు సాధించాడు. వచ్చే సెప్టెంబర్ నెలల్లో జరిగే శ్రీలంక టోర్నీల్లో అండర్ 17 బారత జట్టు తరపున ఆడనున్నట్లు తెలిపారు.

అలుగుపారుతున్న సున్నం మత్తడి



పారుతున్న సున్నం మత్తడి

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలం చెన్నాయిపల్లి–నార్సింగి మండలం శేరిపల్లి గ్రామాల సరిహద్దులోని సున్నం మత్తడి నిండి అలుగు పారుతోంది. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో అలుగు నీరు వాగు ద్వారా అంబాజిపేట పెద్ద చెరువు లోకి పరవళ్లు తొక్కుతోంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



కమలాపూర్‌తండాకు ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేశ్ ఆదివారం తెలిపారు. మరమ్మతుల కారణంగా మూడు రోజులుగా మండలానికి వచ్చే మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బంది ఏర్పడిందన్నారు. సోమవారం నుంచి యథావిధిగా నీటి సరఫరా కొనసాగుతుందని, ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని గ్రామకార్యదర్శులకు సూచించారు.

గుంతలు పట్టించుకోని అధికారులు



నర్సాపూర్ చౌరస్తాలో రోడ్డుపై పడిన గుంతలు

నర్సాపూర్: చౌరస్తాలో ఏర్పడిన గుంతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో గుంతలు పెద్దవిగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. చౌరస్తాలో తూప్రాన్ వైపు వెళ్లే మార్గంతో పాటు సంగారెడ్డి నుంచి చౌరస్తాకు వచ్చే మార్గంలో గుంతలు ఏర్పడి చాలా నెలలు గడుస్తున్నా అధికారులు వాటికి మరమ్మతు చేయించడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు మరింత లోతు కావడంతో ఓ వ్యాపారి ఆదివారం గుంతల చుట్టూ రాళ్లు పెట్టడంతో పాటు హెచ్చరికగా కొమ్మను పెట్టి ప్రమాదాలు జరుగకుండా తన వంతు ప్రయత్నం చేశాడు. గుంతలకు మరమతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రాలను అభివృద్ధి పర్చండి

మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

మెదక్ కలెక్టరేట్: మెదక్ నియోజకవర్గంలోని నాలుగు పర్యాటక కేంద్రాల అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఇటీవల కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ప్రధానంగా పర్యాటక కేంద్రాలకు వచ్చే టూరిస్టుల కోసం కాటేజీలు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఏడుపాయల వన దుర్గ భవాని దేవస్థానం వద్ద ఒక 25 కాటేజీలు, అలాగే మెదక్ ఖిల్లాకు వసతులు కల్పించాలని, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి ప్రాంగణంలో భక్తులకు సౌకర్యార్థమై పది కాటేజీలు నిర్మించాలని కోరినట్లు తెలిపారు. పోచారం వైల్డ్ లైఫ్ బోర్డ్ సెంచరీలో ఆరు కాటేజీలు నిర్మించాలని మంత్రికి వినతి పత్రం అందజేసినట్లు ఆయన వివరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



2009-10 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం

పాపన్నపేట(మెదక్): పాపన్నపేటలో ఆదివారం 2009–10 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 15 యేళ్ల తర్వాత కలిసిన పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఒకరి కొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ తమ కుటుంబాలను పరిచయం చేసుకున్నారు. తాము చేస్తున్న ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర జీవనోపాధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా నాడు తమకు విద్యాబుద్ధులు చెప్పిన టీచర్లు మహేందర్‌రెడ్డి, మోహన్‌రాజ్ , భాస్కర్, సూర్యకళ, జ్ఞానోభ, శ్రీనివాస్, అంజాగౌడ్, రాజశేఖర్, మల్లేశం,అమిత్‌కుమార్, కొండల్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పోచయ్య, ఆసిఫ్, తులసీరాంలను జ్ఞాపికలతో సత్కరించారు. ఆటపాటలతో సందడి చేశారు. పూర్వ విద్యార్థులు దిలీప్, దత్తు,సూఫి కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు చూశారు.అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని పలు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిర్వహణ సరిగా లేక పిచ్చి మొక్కలు తీగలు ఏపుగా పెరిగాయి. స్థానిక పీఆర్ ఆఫీసు పక్క రోడ్డుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు పోలీస్ స్టేషన్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పలు రకాల తీగ మొక్కలు ఏపుగా పెరిగి ట్రాన్స్‌ఫార్మర్ , కరెంటు వైర్ల చుట్టూ అల్లుకున్నాయి. నిర్వహణ సరిగా లేనందునే పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పిచ్చి మొక్కలు, తీగలు వైర్లను అల్లుకోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద షాక్ కొట్టే ప్రమాదాలు లేకపోలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వంతెన నిర్మాణం చేపట్టండి



కూలిపోయిన బ్రిడ్జిపై పారుతున్న నీరు

హవేళిఘణాపూర్(మెదక్): సమస్యలు వచ్చిన సమయంలో వచ్చి అధికారులు వచ్చి హడావుడి చేయడం తప్ప ప్రజలకు అవసరమయ్యే దిశగా అటు ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని మండల పరిధిలోని దూప్‌సింగ్ తండా ప్రజలు ఆరోపిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించిన బ్రిడ్జి నిర్మాణ పనులు ఏళ్ల తరబడి పనులు సాగకపోవడం మూలంగా వర్షాలు కురిసే వేళల్లో రాకపోకలు బంద్ అయిన విషయం తెలుసుకునే అధికారులు తూతూ మంత్రంగా పర్యటించి అధికారులకు ఆదేశాలిచ్చి వెళ్తున్నారే తప్ప సమస్యను పరిష్కరించిన పాపాన పోలేదని తండా వాసులు ఆరోపిస్తున్నారు. గతంలో నుంచి ఇప్పటి వరకు దూప్‌సింగ్ తండాను ఎందరో ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి సందర్శించిన ఎలాంటి పనులు సాగక తమకు ఇబ్బందులు తప్పడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణంకు కృషి చేసి వచ్చే ఏడాదికైనా ఇలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తండావాసులు కోరుతున్నారు.

గుట్టలను మింగేస్తున్నారు..

- జోరుగా మట్టి వ్యాపారం
- పట్టించుకోని అధికారులు



తవ్వకానికి గురవుతున్న రాయరావు చెరువు పంట కాలువ వద్ద ఉన్న గుట్ట

నర్సాపూర్‌రూరల్: నర్సాపూర్ రాయరావు చెరువుతోపాటు పంట కాలువను ఆనుకుని ఉన్న గుట్టలను అక్రమ మట్టి వ్యాపారులు మింగేస్తున్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తుకారం తండాకు వెళ్లే రోడ్డు నుంచి రాఘవరావు చెరువు కట్ట పైకి వెళ్లే దారి పక్కన ఉన్న గుట్టతోపాటు పంట కాలువను ఆనుకొని ఉన్న గుట్ట నుంచి కొంతమంది మట్టిని అక్రమంగా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రివేళలో కొంతమంది జేసీబీ సాయంతో తవ్వకాలు జరిపి పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ మట్టి వ్యాపారాన్ని అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం లేదని, దీంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డు లేకుండా పోయిందని వాపోతున్నారు. ఫిర్యాదు చేసినా రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

హనుమాన్ చాలీసా సంకీర్తనలు



సంకీర్తన చేస్తున్న శ్రీనివాస్‌రావు కుటుంబ సభ్యులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని శ్రీకన్యక పరమేశ్వరీ మాతకు, హనుమాన్ దేవునికి ఆదివారం రాత్రి ప్రత్యేక పూజల అనంతరం ఆలయంలో శ్రీ హనుమాన్ చాలీసా సంకీర్తన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నర్సాపూర్‌కు చెందిన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఖమ్మంకు చెందిన సుందరకాండ శ్రీనివాస్‌రావుతో శ్రీహనుమాన్ చాలీసా దివ్య సంకీర్తన, ధర్మ ప్రవచనములు కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.